క్లుప్తంగా

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



బెల్లంకొండ: వన్యప్రాణుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని పిడుగురాళ్ల అటవీ శాఖ రేంజ్ అధికారి విజయకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలో 70వ వన్య ప్రాణుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంతాలలో స్వేచ్ఛగా సంచరించడం అడవి జంతువుల హక్కు అని తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, వేటాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అటవీ జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. పాపాయపాలెం సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రకాశరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు షేక్ ఖాసిం, కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు

బురఖా ధరించి ఆసుపత్రిలోకి చొరబడిన వ్యక్తి

పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

క్రోసూరు: బురఖా ధరించిన ఒక వ్యక్తి స్థానిక పీహెచ్‌సీలోకి ప్రవేశించేందుకు యత్నించాడు. అతని నడవడిక అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు అక్కడి మహిళల చేత బురఖా తొలగించారు. దీంతో బురఖా ధరించిన యువకుడుగా పట్టుబడ్డాడు. అతనిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో అతను క్రోసూరు శివారులోని కోళ్లఫారంలో కూలి పనులు చేసుకుంటున్నట్లు, తనతో పాటు పనిచేస్తూ పరిచయమైన ముస్లిం మహిళ ఆసుపత్రి వద్ద ఉంటానని, బురఖాలో రావాలని చెప్పిన మీదట అక్కడకు వచ్చానని చెప్పినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు.

బైక్‌ల దొంగ అరెస్టు

అమరావతి: బైక్‌ల దొంగతనం కేసులో నిందితుడిని మంగళవారం అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. అమరావతికి చెందిన చౌటపల్లి కార్తీక్ స్థానిక విజయవాడ రోడ్డులో ఈనెల 2వ తేదీ రెండు మోటారుసైకిళ్లను దొంగిలించి జగ్జీవన్‌రామ్ కాలనీలోని తన ఇంటి వద్ద దాచిపెట్టాడు. అలాగే గుంటూరు రూరల్ మండలం గోరంట్ల వెంకటేశ్వరస్వామి గుడి వద్ద గత నెల 21వతేదీ మరో బైక్ దొంగిలించినట్లు విచారణలో తేలింది. మంగళవారం ఇంటి వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం సత్తెనపల్లి కోర్టుకు తరలించారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరగాలి

రాజుపాలెం: ఆశా కార్యకర్తలు మాతాశిశు సంరక్షణలో ప్రతీ ఒక్కరు ప్రముఖ పాత్ర వహించాలని, గర్భిణులకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురావాలని పల్నాడు జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ హనుమకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కాన్పులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనే జరిగేవిధంగా చర్యలు తీసుకోవా లని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు దోమలు చేరకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పీహెచ్ వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆశా నోడల్ అధికారి ఉషారాణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

సీఈవో జాలాది నాగప్రసాదు

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని (సొసైటీ) రైతులకు ఇక నుంచి డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) విధానంద్వారా అన్నీ రకాల సేవ లు త్వరలో అందుబాటులోకి వస్తాయని సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు వెల్లడించారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సీఈవో నాగప్రసాదు మాట్లాడుతూ శావల్యాపురం సొసైటీ పరిధిలో 17 గ్రామాలు ఉండగా 5034 రైతులు సభ్యత్వ నమోదు చేసుకోగా 1200 మంది అప్పుదారులు ఉన్నట్లు చెప్పారు. సొసైటీ పరిధిలో ఉన్న ఖాతాదారులు సమగ్ర వివరాలతో కూడిన సమాచారం ఆన్‌లైన్ నూరుశాతం పొందిపరిచినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలో వేల్పూరులో శీతల గిడ్డంగి కేంద్రం, ఎరువులు పురుగుమందులు రైతులకు రుణాలు నిమిత్తం ఇప్పటి వరకు రూ.60 కోట్లు ఆర్థిక లావాదేవీలు నిర్వాహణ చేసినట్లు తెలిపారు. అలాగే 121 స్వయం సహాయక సంఘాల్లోని మహి ళా సభ్యులకు రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సొసైటీల్లోని రైతుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్ విధానం చేయటం ద్వారా రుణాలు మంజూరు సొసైటీ సేవల్లో అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా రైతులకు సేవలు అన్‌లైన్ విధానంలో అందుతాయన్నారు. ఆయనతో పాటు సొసైటీ సిబ్బంది రామాంజనేయులు, సతీష్, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రథమ నిర్లక్ష్యం

బస్సుల్లో కానరాని ఫస్ట్ ఎయిడ్ కిట్లు

- అలంకార ప్రాయంగా బాక్సులు
- కొన్ని బస్సుల్లో గడువుతీరిన మందులు
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కూడా కరువే



సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు



అలంకార ప్రాయంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్



కొన్ని బస్సుల్లో ఉన్న గడువు తీరిన మందులు

సత్తెనపల్లి: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అనేది నినాదానికి మాత్రమే పరిమిత మవుతోంది. ఆర్టీసీ ప్రయాణికుల భద్రతను అధికారులు గాలికొదిలేశారు. ప్రయాణ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు బస్సుల్లో ఉంచాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు బస్సుల్లో మచ్చుకైనా కనపడటం లేదు. పలు బస్సుల్లో బాక్సులు ఉన్నప్పటికీ అవి అలంకార ప్రాయంగా మారాయనే చెప్పవచ్చు. అయితే బాక్స్‌లో పూర్తిస్థాయిలో అన్ని వస్తువులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్న కనీస విషయాన్ని ఆర్టీసీ అధికారులు విస్మరించారు. కొన్ని బస్సుల్లో గడువు తీరిన మందులు ఉంచారు.

ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాల్సిన కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రపోతుంది. మందుల కొనుగోలుకు నిధులు కేటాయించక పోవడంతో ఆర్టీసీ అధికారులు ఆస్పత్రులు, దాతల కోసం ఎదురుచూస్తున్నారు.

సత్తెనపల్లి డిపో పరిధిలో...

సత్తెనపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన ప్రయాణికులతో పాటు నరసరావుపేట, తాటికొండ నియోజకవర్గాలకు చెందిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్సుల్లో ఏర్పాటు చేయాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్ల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ సమయంలో ఖచ్చితంగా ప్రథమ చికిత్స గురించి తర్ఫీదిస్తారు. బాక్స్‌లో మందులు, సామాగ్రి లేకపోవడంతో సిబ్బంది కూడా చేసేదిలేక గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నారు.

బాక్స్‌లో ఉండాల్సిన సామగ్రి

స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్	:	2
ఎలాస్టిక్ బ్యాండేజ్ రోలర్స్	:	5
బెటాడియన్ ఆయింట్‌మెంట్ (యాంటీ సెప్టిక్ క్రీమ్)	:	1
డెటాల్ లేక స్యాక్లాన్	:	1
నియోసిన్ పౌడర్ డబ్బా	:	1
సర్జికల్ బ్లేడ్	:	1
బర్నాల్ ఆయింట్‌మెంట్	:	1
వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, వైట్ ప్లాస్టర్ టేప్	:	1
బ్రాండెడ్ ఎయిడ్ ప్లాస్టర్, స్టెరిలైజ్డ్ ఎలాస్టిక్ ప్లాస్టర్లు	:	3

అన్ని బస్సుల్లో మెడికల్ కిట్లు ఏర్పాటు చేస్తాం

ఆర్టీసీ బస్సుల్లో మెడికల్ కిట్లు ఉండేలా వెంటనే చర్యలు తీసుకుంటాం. మెడికల్ కిట్లు అందుబాటులోనే ఉన్నాయి. ఏ ఏ బస్సుల్లో లేవో పరిశీలించి వాటిల్లో ఏర్పాటు చేయిస్తాం. బస్సుల్లో గడువు తీరిపోయిన కిట్లను తొలగించి అన్ని ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో కిట్లు ఏర్పాటు చేస్తాం.

–జీఎస్‌వీవీ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, సత్తెనపల్లి

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సత్తెనపల్లి డీఎల్‌డీఓ రాజగోపాల్



మొదటి విడత శిక్షణ పొందిన 13 గ్రామ పంచాయతీల ప్రజా ప్రతినిధులతో అధికారులు

సత్తెనపల్లి: ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సత్తెనపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వై.రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని కొమెరపూడి, కంటెపూడి, కట్టావారి పాలెం, నందిగామ, గుడిపూడి, లక్ష్మీపురం, పెదమక్కెన, గర్నెపూడి, లక్కరాజుగార్ల పాడు, భీమవరం, అబ్బూరు, గండ్లూరు, దీపాలదిన్నెపాలెం గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, ఒక్కో పంచాయతీ నుంచి ఎంపికైన ఇరువురు పంచాయతీ వార్డు మెంబర్లకు చేపట్టిన శిక్షణ తరగతులు మొదటి విడత ముగిశాయి. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ రాజగోపాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడేలా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులైన ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో కీలకపాత్ర పోషించాలన్నారు. అన్ని రకాల అభివృద్ధి, ప్రణాళికలో భాగస్వామ్యం కావాలని, అన్ని అంశాలపై అవగాహన చేసుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో పూర్తిస్థాయిలో ప్రజాప్రతినిధులైన ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. శిక్షణ అనంతరం గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రజాపరిషత్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



పెదకూరపాడులో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దానియేలు

పెదకూరపాడు: అర్హతకలిగిన ప్రతి ఒక్కరు గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పెదకూరపాడు తహసీల్దార్ మీసాల డేనియల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు కచేరీ సెంటర్లో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్ ఎన్నికల నమోదు సెంటర్‌ను తహసీల్దార్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో పాత ఓటర్ లిస్ట్ ఉండదని ప్రతిఒక్కరూ నూతనంగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు నమోదు చేసుకొనుటకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఓటర్ నమోదుకు డిగ్రీ ప్రొవిజినల్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోతో ఓటు నమోదు చేసుకోవచ్చని అన్నారు. జనచైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, రాయపూడి సాంబశివరావు మాస్టారు, బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, పెదకూరపాడు మాజీ ఉప సర్పంచ్ షేక్‌మస్తాన్ షరీఫ్, వీఆర్వోలు నాయుడమ్మ, శ్రీకాంత్, కొరప్రాటి వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉద్యోగులు మన్నవ వీరయ్య, దర్శి రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోవాలి

సీపీఎం నాయకుడు రావెల వెంకటేశ్వర్లు

అచ్చంపేట: తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఎం మండలశాఖ కార్యకర్తలు డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్‌కు అందజేశారు. ఆ పార్టీ మండలశాఖ కార్యదర్శి రావెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇసుక కొరతతో పనులులేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ట్రక్కు ఇసుక రూ.452లు కాగా బ్లాకులో రూ.6000కు విక్రయిస్తున్నారన్నారు. చాలా మంది అంత ధర భరించలేక ఇంటి నిర్మాణాలను నిలిపేస్తున్నారని చెప్పారు. మాదిపాడు స్టాకు పాయింట్‌లో ఇసుక అయిపోయిందని, మిగిలిన రీచ్‌లలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని దుయ్యబట్టారు. భవన నిర్మాణాలు ఆగిపోవడంతో ఇసుక ఆధారిత కార్మికులు పనులు లేక వీధులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఆగిపోయిన బీమా సౌకర్యాన్ని తిరిగి ప్రారంభించాలని, వెల్ఫేర్ బోర్డు అమలు పరచాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహాయ కార్యదర్శి గుంజి రవికుమార్, రైతు సంఘ నాయకులు షేక్ హసన్, కె.కె.రెడ్డి, డీబీఆర్‌సీ మండల కార్యదర్శి సందెపోగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీ.. ధాన్యలక్ష్మి

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు భక్తులు భక్తిశ్రద్ధలతో సందడిగా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో మంగళవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు.

– సత్తెనపల్లి/బెల్లంకొండ/అచ్చంపేట/రాజుపాలెం/ముప్పాళ్ల/ పెదకూరపాడు



సత్తెనపల్లిలో లలిత త్రిపుర సుందరీదేవిగా ..



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గాపీఠంలో కరెన్సీనోట్లతో లక్ష్మీదేవి



సత్తెనపల్లి వడ్డవల్లి బ్రహ్మంగారి గుడి వద్ద కుంకుమ పూజలో మహిళలు



పెదమక్కెనలో మహాలక్ష్మీదేవి అలంకారం



అచ్చంపేటలోని రాజరాజేశ్వరి దేవిగా కన్యకాపరమేశ్వరి




ఇనిమెట్లలో మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



చాగంటివారిపాలెంలో మహాలక్ష్మిగా..



75 త్యాళ్లూరులో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు



బెల్లంకొండలో ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు

విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి



బెల్లంకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి తెలిపారు. మంగళవారం ప్రకటనలో మాట్లాడుతూ విద్యార్థుల హాజరుపై కఠినంగా వ్యవహరించాలని, విద్యార్థులు కళాశాలలకు హాజరయ్యే విధంగా ఇంటర్మీడియట్ బోర్డు పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రత్యేక సందర్భాలు ఉంటే 75 శాతంలో 15శాతం వరకు హాజరు మినహాయింపు ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు 60 శాతం హాజరు లేకపోతే పరీక్షలకు అనుమతించబోమని తెలిపారు. ఆర్ట్స్ గ్రూపు విద్యార్థులను మాత్రం ప్రైవేట్ విద్యార్థులుగా పరిగణించి పరీక్షలకు అనుమతిస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



అచ్చంపేటలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

అచ్చంపేట: పత్తిలో రసంపీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, రైతులు వెంటనే వాటినుంచి రక్షణ పొందాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం అచ్చంపేట, నీలేశ్వరపాలెం గ్రామాలలో పత్తి పంటలను ఆయన పరిశీలించారు. రైతు సేవా సిబ్బంది వీహెచ్ఏ ఏనోష్, బిల్లా రహీం, అచ్చంపేట సర్పంచ్ షేక్ జానీ పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి, దేవరంపాడు గ్రామాలలోని వరి పంటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులకు వరిలో ఆకు ముడత తెగులు, ఆకుపచ్చ తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మొక్కపాడు పశువైద్యాధికారి డాక్టర్ కె.నాగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాకురాలు షేక్ ముస్తాక్, ఎంపీఓ డి.భవాని, పశువర్ధక సహాయకులు వై.తేజకుమార్, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండలంలోని పరస, కంభంపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి మాట్లారు. క్రోసూరు ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ వ్యవసాయాధికారి సిహెచ్ మల్లికార్జునరావు,యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ కె.అంబిక, వ్యవసాయ సహాయకులు పి.చిన్నబాబు, అర్తిమళ్ళ వెంకటకృష్ణారావు, అర్తి మళ్ళ వెంకటేశ్వర్లు, సరిపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నకరికల్లు: పిలకదశలో ఉన్న వరిలో పురుగు సోకినపుడు తాడుతో చేనుకు అడ్డంగా రెండుమూడుసార్లు లాగినట్లయితే పురుగులు కిందపడిపోతాయని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని దేచవరం, చల్లగుండ్ల, అడ్డరోడ్డు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సూచనలు ఇచ్చారు. పశువైద్యాధికారి డి.దాసు, సెరీకల్చర్ అసిస్టెంట్ ఎ.యాకోబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.దిలీప్‌కుమార్, ఎంపీఓ కె.రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం, ముప్పాళ్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణ పాల్గొని రైతులకు సూచనలు అందించారు. వెటర్నరీశాఖ జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఏఈఓ కె.పావని, పి.శ్రీనివాసరావు, వీఆర్వో సంజీవరావు పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని క్రోసూరు, పీసపాడు గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది సందీప్, గోపి, పవన్ కుమార్, కాంద్రు కాశయ్య, రైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: వరి పైరులో సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని నందిరాజుపాలెం, న్యూ చిట్యాల గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు

మహిళా పోలీసు మెడలో చైన్ స్నాచింగ్

క్రోసూరు: అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన వివాహిత మెడలోని బంగారు చైనును దుండగులు లాక్కుని పారిపోయిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరావు తెలిపిన వివరాల మేరకు గుంటూరు వద్ద తురకపాలెం పంచాయతీ సచివాలయంలో మహిళా పోలీసుగా పని చేస్తున్న గడిపర్తి జ్యోతి స్వగ్రామం అచ్చంపేట మండలంలోని గ్రంథసిరి గ్రామం. ప్రతి రోజు తురకపాలెం వెళ్లి విధులు నిర్వర్తించి గ్రంథసిరి చేరుకుంటుంది. అదే విధంగా జ్యోతి డ్యూటీ ముగించుకుని అమరావతి మీదగా క్రోసూరుకు వచ్చే బస్సులో వస్తూ క్రోసూరు శివారు మార్కెట్‌యార్డు వద్ద దిగింది. అక్కడ నుంచి గ్రంథసిరి వెళ్లేందుకు తన మామ పెదబాబు మోపెడ్ పై ఎక్కించుకుని వెళ్తుంటాడు. ఈ క్రమంలోనే వెళ్తుండగా మార్గమధ్యంలో గల లోలెవల్ చప్టా వద్ద దొంగ ఆమె మెడలోని 3 సవర్ల బంగారు చైను లాక్కుకుని తనతోపాటు వచ్చిన మరోవ్యక్తి వాహనంపై ఎక్కి పారిపోయారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నివాసయోగ్యమైన ఇళ్ల స్థలాలు ఇవ్వండి



ఎమ్మెల్యే కన్నాకు సమస్యలు తెలియజేస్తున్న మహిళలు

సత్తెనపల్లి: పక్కా గృహ నిర్మాణాలకు నివాసయోగ్యమైన ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు పేదలు కోరారు. పట్టణంలోని 24వ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు పలువురు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పేద మహిళలు మాట్లాడుతూ పట్టణంలోని 24వ వార్డులో నివసిస్తున్న తమకు సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి, పాకాలపాడు గ్రామాల్లో కేటాయించిన ఇళ్ల స్థలాలు నివాసయోగ్యానికి అనువుగా లేవని, నివాసయోగ్యానికి అనువైన స్థలాలను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో నివశిస్తున్న పేదలకు కంకణాలపల్లిలో 300 మందికి, పాకాలపాడులో 200 మందికి ఇళ్ల స్థలాలు గతంలో కేటాయించారని, ఆ స్థలాలు గృహ నిర్మాణాలకు అనువుగా లేవన్నారు. దీనిపై కమిషనర్ కొలిమి షమ్మితో ఎమ్మెల్యే కన్నా మాట్లాడారు. అలాగే గడియార స్తంభం సెంటర్ నుంచి లక్కరాజుగార్లపాడు సెంటర్‌లోని వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వరకు ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, రాత్రులు కొందరు మద్యం సేవిస్తున్నారని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందని పలువురు ఎమ్మెల్యే కన్నా దృష్టికి తీసుకువచ్చారు. విద్య, వైద్యం, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, అర్హులు పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందించారు. మొత్తం 97 మంది వినతులు అందించినట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురక మేరీగ్రేస్, నాయకులు చౌటా శ్రీనివాస రావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీ పరిపాలనపై సత్తెనపల్లి మండలంలోని గ్రామ పంచాయతీల్లోని అందరూ ఉపసర్పంచ్‌లు, ఒక్కో గ్రామ పంచాయతీకి ఇరువురు వార్డు మెంబర్లు చొప్పున ఈ నెల 9,10 తేదీల్లో రెండవ విడత శిక్షణ జరుగుతుందని సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఇప్పటికే 13 గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులకు ఈ నెల 7,8న మొదటి విడత శిక్షణ పూర్తి అయ్యిందన్నారు. మండలంలోని భట్లూరు, గుజ్జర్లపూడి, గోరంట్ల, కట్టమూరు, రెంటపాళ్ళ, పాకాలపాడు, పణిదం, కంకణాలపల్లి, ధూళిపాళ్ల, భృగుబండ, కందుల వారిపాలెం, గోగులపాడు గ్రామ పంచాయతీలకు రెండో విడత శిక్షణ జరుగుతుంద న్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లు (ఒకరు పురుషులు, మరొకరు మహిళలు) హాజరు కావాలని ఆయన అన్నారు. శిక్షణ సత్తెనపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు, ఎంపికైన వార్డు మెంబర్లు శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సీడీపీఓ శ్రీలతకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరి, కార్యకర్తలు

సత్తెనపల్లి: అంగన్‌వాడీ సెంటర్లకు కొత్తగా వచ్చిన ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. పట్టణంలో సీడీపీఓ టి.శ్రీలతకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో రిజిస్టర్లు కొనాలంటే రిజిస్టర్ రూ.160 నుంచి రూ. 200 ఖర్చు అవుతుందని, ఇది భరించలేకపోతున్నారన్నారు. కాబట్టి గతంలో మాదిరిగా సెంటర్లకు రిజిస్టర్లు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. జిల్లాలో హెల్పర్లకు సంబంధించిన పదోన్నతులు ఇవ్వమని జీవో ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలు లెటర్ తెచ్చుకోమని అనడంతో అవకాశం ఉన్నా పదోన్నతులు ఆగిపోతున్నాయన్నారు. జిల్లాలో రాజకీయ వేధింపులు ఎక్కువగా ఉన్నాయన్నారు. చాలా చోట్ల రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. బెల్లంకొండ రెండు సెంటర్లలో ఊళ్లో రాజకీయ నాయకులు అర్జీలు పెడుతుంటే పదే పదే సూపర్‌వైజర్లు సీడీపీవోలు విజిట్ చేస్తున్నారని, లబ్ధిదారులు అంతా మంచిగా చెప్పినప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడికి వారు వర్కర్లని మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఇటువంటి రాజకీయ వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్న సందర్భంలో అమరావతి ఎస్సీ సెంటర్ రాజకుమారిని తొలగించారని, ఆమె ఏ ప్రచారంలోనూ పాల్గొనలేదని, ఆమెని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. నరసరావుపేట మండలంలో కొన్నిచోట్ల వర్కర్లు హెల్పర్స్ కూడా భయపడి రాజీనామాలు చేశారని, అటువంటి వారందరి రాజీనామాలు రద్దు చేసి వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న వర్కర్స్, హెల్పర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు కోరారు. మట్టి ఖర్చులు, నెలకొక టీఏ బిల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్కే సుజాత, గీత పాల్గొన్నారు.